# ఋణానుబంధం

X

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ

“టెలిగ్రాం సార్!” అంటూ కవరు ఇచ్చి సంతకం చేయించుకు వెళ్లి పోయాడు పోస్టుమేన్. కవరు చింపి కాగితం చదివే సరికి నా గుండెల మీద పిడుగు పడ్డట్లుగా హృదయం నూరు వ్రక్కలై పోయింది. మళ్లీ చూచా కాగితం “రమాదేవికి చాలా సీరియస్. వెంటనే రావలెను,’ అనే టెలిగ్రాం చూస్తూంటే నే; నా కళ్లంట కారే నీళ్ళల్లో అది తడిసి పోవడంకూడా నేను గుర్తించే స్థితిలో లేను. “ఛాయా! నీ రమ ఈ స్థితికి రావడానికి కొంత బాధ్యురాలవు నువ్వే సుమా!” అని నా అంతరాత్మ ఘోషిస్తోంటే నాలోనే కుమిలి కుమిలి ఏడుస్తూ అల్లాగే కూలబడి పోయా. “నేను చచ్చి పోయే ముందు మాత్రం నాకు సీరియస్‌గా వుందని నీకు టెలిగ్రాం ఇప్పిస్తే తప్పకుండా నన్ను చూడ్డానికి వస్తావా?” అని అన్న రమ మాటలు నా హృదయంలో ప్రతిధ్వనిస్తోంటే గతం అంతా కళ్ళకి కట్టినట్లు గుర్తొస్తుంది.

పుష్కరం క్రిందట రమాదేవితో ఛాయాదేవికి పరిచయమైంది. జీవితంలో ఎన్నో దుఃఖాలుపొంది, అనేక ఢక్కా మొక్కీలు తిన్నందువల్ల గడిచిన కష్టాల్ని తల్చుకొంటూ తర్చుగా దుఃఖిస్తూండేది రమ. అప్పట్లో ఛాయకు సంసారంలో వుండే మంచి చెడ్డలు కష్టసుఖాలు తెల్సుకొనేటంత అనుభవజ్ఞానం లేదు. ఎప్పుడూ సరదాగా కాలక్షేపం చెయ్యాలని, షైరుకి, సినీమాలకి, పార్కుకి పోవాలనీ, తన వలెనే ఎదుటి వాళ్లుకూడా నవ్వుతూ ఖులాసాగా వుండాలనే భావించేది. ఆఖరుకి ఓ రోజున అడిగేసింది “రమా! ఎప్పుడూ ఎందుకు నువ్వింత దిగులుగా వుంటావ్? నీకు బహుశా నవ్వడం కూడా చేత కాదనుకొంటా!,’ అంది ఛాయ.

“ఛాయా! పిల్ల కాకికేం తెలుస్తుంది హుండేలుదెబ్బ? నా కష్టాల్ని నువ్వర్థం చేసుకోలే వమ్మా! నా బాధల్ని. నా గాథల్ని చెప్పి నీ మనస్సును నొప్పించడం కూడా నా కిష్టంలేదు.” అంది రమ.

“పోనీ నే నున్నంత సేపూ నా ఎదురుగానైనా కనీసం నవ్వుతూ కన్పించు... లేకపోతే ఒకొక్కప్పుడు నిన్ను చూస్తే నాకు చాలా అసహ్యంగా కూడా వుంటోంది” అంది ఛాయ.

రమ విధిలేక ఎరువు తెచ్చుకొన్నా నవ్వుతో ఎదురుగా కన్పిస్తూండేది ఛాయకి. ఛాయకి రోజుకి ఒక గంట కాలమైనా కన్పించకపోతే రమకి గడిచేదెట్లా?.. ఛాయాదేవి ఇంట్లో వంట మనిషి అయిన రమ భోజనాల సమయంలో నైనా మాట్లాడాల్సిన అవసరం తప్పనిసరి - ఛాయ ఆమె భర్త భోంచేసి లేచేవరకూ లేని హుషారు తెచ్చుకు కబుర్లు చెప్తూండేది. రమకి ఓ కొడుకు కూతురు వారాలు చేసుకు యాచించి చదువు కొంటున్నారు. కనీసం వాళ్ళ బట్టలకైనా కొంత సొమ్ము సంపాదించి పంపించాలని ఛాయ ఇంట్లో వంట మనిషిగా కుదిరింది రమ. ఛాయ భర్త నెలకు నాల్గు వందలు సంపాదించే ఆఫీసరు. పొంగిన పాల మీద నీళ్లు చల్లాల్సిన అవసరం లేకుండా హాయిగా గడిచే దాంపత్య సంసారం ఛాయది. పూటకి ఠికాణా లేని పేద జీవి రమ. - అయినా సహజ దయాశాలిని కాబట్టి అంతస్థులను పాటించక రమాదేవిని స్వంత అక్కగారిలా భావించేది ఛాయ - ఒక్క సంవత్సరంలో ఇద్దరూ బాగా సన్నిహిత స్నేహితులై వంట మనిషిలా భావించడం మానేసి సంసార భారమంతా అప్పగించి అక్కగారనే చెప్పుకొనేది ఛాయ.

“రమా! ఇల్లా వంట చేసినందువల్ల నీ వక్కర్తికి లోటు లేకపోయినా నీ బిడ్డలు మాత్రం అభివృద్ధికి రాలేరు. అందుకు ఇంకేదైనా కృషి చేస్తూంటే” అంది ఛాయ.

“నాకు ఇల్లు కదలి బయటకి వెళ్ళడం ఇష్టం లేదు ఒకప్పుడు చాలా పరువుగా బ్రతికిన వాళ్ళ మవడం చేత...” అంది రమ.

“పోనీ ! ఎవరైనా నలుగురు పిల్లలకి ఇంట్లో కూర్చుని ట్యూషన్లు చెప్పుకో కూడదా?”

“ఊహూ ! అల్లా చెప్పలేను కాని వ్రాయగలను”

“అయితే ఏవైనా కథలు వ్రాయ గలవా ?”

“నా జీవితం లోనే వున్నాయి కావల్సినన్ని కథలూ గాథలు”

“ఇంక నేం? అయితే కథా వస్తువు కోసం వెతుక్కోనక్కర్లేదు. అవే వ్రాసెయ్యి - దానివల్ల నీకు డబ్బూ వస్తుంది; కొంత దుఃఖం తగ్గుతుంది”

"అయితే నా చేత్తో నా గుండెల మీదే కొట్టుకోమంటావా?"

"అదికాదు రమా నే చెప్పేది? ఇంకో నాలుగేళ్ళల్లో నీ పిల్లలు పెద్ద చదువుల్లోకి వస్తారా? అప్పుడు వాళ్ళకి నువ్వు కొంచెమైనా డబ్బు ఇవ్వక పోతే.....కనీసం తల్లిగానైనా నీ ఋణాన్ని, నీ కర్తవ్యాన్ని తర్చుకోవద్దా? మనిషి అన్న వాళ్లు కష్టపడ్డం; సుఖాల్ని పొందడం; వాళ్ళ పూర్వ జన్మ సుకృతాన్ని బట్టి వుంట్నుంది. ఒక వేళ మేము ఈ ఊరునుంచి ట్రాన్ఫరు అయి వెళ్లిపోతామనకో; అప్పుడు నువ్వు కూడా మాతో వస్తావా?"

"నే నెక్కడికీ రాను. నాకూ ఈ ఊరుకీ ఋణాను బంధం తీర్చాలంటే ఒక్క మృత్యువే నన్నిక్కడనుంచి వేరు చెయ్యాలి......" అంది దృఢంగా రమ.

"అయితే మేము వెళ్లిపోతే రాత్రిం బగళ్లు ఒక్కర్తెవూ కూర్చుని ఏడుస్తూ వుంటావా?......"

"ఏం చేస్తాను అంతకంటే? ఎవరైనా పుణ్యాత్ములు, వంట చేయించుకోగల సమర్థులు వస్తే వాళ్లదగ్గర చేరుతాను...ఒక వేళ ఎవరిదగ్గర నేను వంటపుట్టిగా చేరినా, మీ దగ్గర ఉన్నట్లుగా ఇంకెవరి దగ్గరా నే నుండనూ లేను; మ రెవరూ నన్నింత అభిమానంగానూ చూడరు... ఈ రోజుల్లో దరిద్రులని చూచి ఆదరించేటంత సహృదయు లెవరుంటారు ఛాయా!"

"అల్లాగయితే స్నేహితురాలిగా నేనో సలహా చెప్తా తప్పక వింటావా?"

"నేను వినడమంటూ వస్తే ఈ లోకంలో నీ ఒకర్తి మాట మాత్రమే వింటా - నీ యందు నాకు అటువంటి స్నేహం, ప్రేమ, అభిమానం నాలో వున్నాయి ఛాయా! అంది రమ.

"అల్లాగయితే తీరిక సమయంలో నీ మనశ్శాంతికి కథలు వ్రాస్తూండు. ఆ విధంగా వ్రాస్తూ వుండడంవల్ల నీ మనోవేదన కొంత శాంతించి క్రమంగా గతించిన దుఃఖాన్ని మర్చి పోగల్గుతావు - ఏకాంత జీవితంలో నీ రచనలే నీ కష్టాల్ని తెల్సుకొనే మిత్రులుగానూ, నీ భావికి నాందిగానూ కూడా సహాయ పడ్తాయి."

"నేను వ్రాసుకొని నాలో నేనే తృప్తిపడాలి కాని అవి ఇతరులకి మాత్రం నిరుపయోగం ఛాయా! అంత మాత్రానికి వ్రాసి మాత్రం ఫలితం ఏముంది ?"

"పిచ్చి రమా! అల్లా ఎప్పుడూ భావించుకోకు. ఒకరి జీవితానుభవంలో నుంచి ఇంకొకరు నేర్చుకోవల్సిన నీతి, గుణపాఠం చాలా వుంటుంది"

"నే నేం పెద్దగా చదువుకోలేదు. పట్నాలన్నీ చూడనూలేదు. అటువంటిది ఏమి వ్రాయడానికైనా నాకేం తెలుస్తుంది ఛాయా!" "పట్నాల్లోకంటే వర్ణించదగిన చక్కని ప్రకృతి సౌందర్యం, అమాయిక జీవితాలు పల్లెల్లోనే వుంటాయి. నీకు తెల్సినంత వరకూ వ్రాయి.....రమా! నువ్వు మీ అబ్బాయికి, అమ్మాయికి వ్రాసే జాబులు చూస్తూంటే నే నీలో చక్కని సామర్థ్యం వున్నట్లు తెల్సింది ఇదివరకే. తప్పక నువ్వు సఫలీకృతవౌతావు"

"ఈ కల్లబొల్లి కథలవల్ల ఏం ప్రయోజనం ? ఇల్లాంటి కథలకి పెద్దలంతా మెచ్చుతారా చెప్పు? ఏదైనా ఒక మంచిదైన గ్రంథం రామాయణ భారతం వంటివైతే, దైవభక్తితో కూడి వుండడంచేత అందరూ చదువుకోడానికి యోగ్యంకాని ఈ కట్టు కథ లెందుకు చెప్పు?"

"అక్షరాభ్యాసం నాడే బి. ఎ. డిగ్రీ పొందాలంటే అసాధ్యం! అదీ కాక ఈ చిన్న కల్పిత కథలు, చదివే వాళ్ళ మనస్సుకి ఎంతో ఉత్సాహా నిస్తాయి. నెమ్మదిగా కథలు వ్రాయడం ప్రారంభించు. తర్వాత వ్యాసాలు వ్రాయి. అటుపైన నవల్సు వ్రాయడం నేర్చుకో-ఎల్లాగో కష్టపడి వ్రాశావంటే నీకు తగిన డబ్బూవస్తుంది; పేరు వుంటుంది. నీ పిల్లల చదువు పూర్తవుతుంది. అప్పుడు నీ కింక డబ్బు సంపాదించాలనే సమస్య లేనప్పుడు సావకాశంగా కూర్చొని జన్మకి సరిపోయేవి రెండు సద్గ్రంథాలు రచించుకో - వాటితో నీ కీర్తి తరతరాలా నిల్చి పోయి వుంటుంది"

"సరే ప్రయత్నిస్తా"

"అల్లాక్కాదు! తప్పక వ్రాస్తాను అని మాటివ్వాలి" అంటూ పట్టుబట్టింది ఛాయాదేవి.

వెంటనే కాగితాలు కలం తెచ్చి యిచ్చి "ముందుగా ఓ కథ వ్రాయి. అసలు నీ రచన, శైలి, కథావస్తువు... అంతా ఎల్లా వుంటుందో చూస్తాను" అని చెప్పి అక్కడనుంచి వెళ్లిపోయింది ఛాయాదేవి.

ఆ రాత్రికే ఒక చిన్న కథ తయారు చేసి ఛాయకిచ్చి వంట పనిలోకి వెళ్లిపోయింది రమ.

(తరువాయి 28వ పేజీలో)

(6వ పేజీ తరువాయి)

"అబ్బ! ఎంత చక్కగా వ్రాస్తావు రమా! నువ్వింత బాగా మంచి సన్నివేశాలతో కథ ఇల్లా వ్రాస్తావనుకోలేదు రమా." అంటూ అభినందించింది ఛాయ.

"ఏమిటో! ఇది వ్రాస్తూంటే నా మనస్సులో గాయాన్ని రేపుకొంటూన్నట్లుంది. అసలు బాగుందా?

"చాలా బాగుంది. రచయితల మనోభిప్రాయాలే వారి కథల్లో పాత్రలచేత పల్కిస్తారు. అందుకనే పాత్రలు సజీవంగా వుండాలి. నువ్వు బాగా కృషి చేస్తే తప్పక అభివృద్ధికి రాగలవు రమా! ప్రయత్నించి ఇంకా బాగా వ్రాస్తూండు" అంటూ ప్రోత్సాహమిచ్చింది ఛాయ.

ఛాయాదేవి ప్రోత్సాహంతో రమకి కథా రచనకి అభిలాషకల్గి సామాన్య సంసారాల్లో కల్గే మంచి చెడ్డలన్నీ కథల రూపంలో అల్లి ఇస్తూండేది. "బాగున్నాయి" అని ఛాయ మెచ్చుకోవడంతో ఇంకా బాగా వ్రాయాలని పట్టుదల వహించి అరరాత్రి దాటినా కూడా వ్రాతలోనే మునిగి పోయివుండే రమని ఇంక చాలించమని మందలించేది మిత్రురాలు.

రమ బీదరికంలో తను వ్రాసిన కథలు ఏ పత్రికకైనా పంపించే సామర్థ్యం కూడా లేకపోండం చేత అల్లాగే నిలవ చేసింది కొన్నాళ్లు. కాని తన బిడ్డల చదువుకోసం చాలా ఒడుదుడుకులు రావడమే కాకుండా కొడుకుకి జబ్బు చేసింది. ఆ రోజుల్లోనే ఛాయాదేవి భర్తకు చాలా దూరం ట్రాన్స్ఫరై వెళ్లిపోవడమూ; రమ కొడుకు దగ్గరకి వెళ్ళడం; జరిగింది. తను వ్రాసిన కథలు అమ్మి ఆ సొమ్ముతో కన్న బిడ్డను రక్షించుకొంది రమ.

ఆతర్వాత కొన్నాళ్ళకి ఛాయాదేవి రమ్మని వ్రాయగా రమ వారింటికి వెళ్లింది.

"రమా! నువ్వు ఎంతో కష్టపడి వ్రాసిన కథలు ఇతరులకి ఇచ్చేస్తే అవి "ఏతంతు సంతతి" వలె నీ పేరు ప్రఖ్యాతులు లేకుండా పోతున్నాయి, నేను కొంత డబ్బిస్తాను. అవి పోష్టులో పంపించి నీ పేరుతో పత్రికల్లో వేయించుకో. దానివల్ల నీకు కొద్దో గొప్పో ధనం, పేరు కూడా వస్తుంది." అని కొంత సొమ్మిచ్చింది ఛాయాదేవి.

కథలు రచించడానికి తన ఆరోగ్యాన్ని కూడా లెఖ్ఖ చేసేదికాదు రమ. భవిష్యత్‌లో ఉత్తమ స్థానాన్ని పొందాలని ఆమె దృఢ సంకల్పం - ఆ నిశ్చయాభిప్రాయంతోనే ఆమె అవిరళంగా కృషి చేసింది. ఆమె దీక్ష, ఆ పట్టుదల, ఆమె ఉన్నత ఆశయాలు, ఆమె రచనా సామర్థ్యాన్ని చూస్తూంటే ఛాయాదేవి అత్యాశ్చర్య పోయేది.

రచయిత్రిగా తన రమాదేవి త్వరలోనే ఉన్నత స్థానం పొందుతుందని, తన స్నేహితురాలి కీర్తిని గురించి తను గర్వంగా చెప్పుకోవాలని ఆశించేది ఛాయాదేవి - రమ కృషిచేసి తను అనుకొన్న విజయాన్ని సాధించి పొందగలదని ఛాయాదేవికి తెలుసు—

పది సంవత్సరాలు గిర్రున తిరిగి పోయాయి, పాఠకులంతా రమాదేవి రచనల్ని మెచ్చుకొని అభినందిస్తోంటే, ఆమెకి సన్మానాలు జరుగుతోంటే మితిలేని ఆనందాన్ని పొందేది ఛాయ. ఈ దశకాలం ఛాయకు రమ దూరంలో వున్నా వారిద్దరిలోనూ స్నేహం మాత్రం ఎప్పుడూ అంటి పెట్టుకొనే వుండి ఉత్తరాలద్వారా పలకరించుకొంటూండే వారు.

ఆఖరిసారిగా ఛాయ రమను చూడ్డానికి వెళ్లింది. రమకి గౌరవ సత్కీర్తి ఎంత ఎక్కువగా వుందో; ఆరోగ్యం అంత తక్కువై పోయింది. అతి నీరస స్థితిలోవున్న రమను చూచి ఛాయ బావురుమంది. తన మిత్రురాల్ని వదలి రాలేక నాల్గురోజులు ఆగిపోయింది ఛాయ.

"ఇంకో సంవత్సరం ఇల్లాగే కష్టపడి కృషి చేస్తేనే కాని నా కోరిక పరిపూర్ణం కాదు - అప్పటికి మా పిల్లలిద్దరూ డిగ్రీలతో ఇంటికి వచ్చి నన్ను సుఖ పెడ్తారు ఛాయా!" అంటూ పేలవంగా నవ్వేసింది రమ.

"నా ఆరోగ్యం చెడినా; నే చనిపోయినా ఎవ్వరికీ బాధనీయం కాదు ఛాయా! నా బిడ్డలు మాత్రం భవిష్యత్‌లో సుఖిస్తే బాలు. అందుకే నేనింత కష్టపడ్తున్నా' అంది మళ్లీ రమ.

ఇప్పటికి సరిగ్గా వారం క్రిందటే ఉత్తరం వ్రాసింది. తన బిడ్డలిద్దరూ చదువులు పూర్తయి ఇంటికి వచ్చారనీ; ఇంకతను కొంతకాలం సుఖంగా విశ్రాంతి తీసుకుంటాననీ; ఒక్కసారి తనని చూచి వెళ్ళడానికి రమ్మని వ్రాసింది రమ.

మళ్లీ ఇప్పుడు ఈ టెలిగ్రాం—ఇవన్నీ తల్చుకొంటూ మర్నాడు తన భర్త క్యాంపు నుంచి ఎప్పుడు వస్తాడా? అని గుండెలు పగిలేటట్లు ఏడుస్తూ ఆ రాత్రంతా గడిపింది ఛాయ.

ఇంటికి వచ్చిన భర్త టెలిగ్రాం ఛాయ చేతికి ఇస్తూ రమకీ ఈ లోకానికీ ఋణానుబంధం తీరిపోయింది-మళ్లీ మనం చూడనే లేక పోయాం! పాపం" బ్రతికున్నంత కాలం సుఖించనే లేదు!!!" అంటూ కన్నీటితో చెప్పాడు.